క్లుప్తంగా

శావల్యాపురం ఎస్సైగా లోకేష్



శావల్యాపురం: శావల్యాపురం మండలం నూతన ఎస్సైగా లేళ్ళ లోకేష్‌రావు నియమితులయ్యారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలోని సీసీఎల్ విభాగం నుంచి ఆయన ఇక్కడకు వస్తున్నారు. ప్రస్తుత ఎస్సై చల్లా సురేష్ నకరికల్లు మండలానికి బదిలీ అయ్యారు. త్వరలో లోకేష్‌రావు బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఐనవోలు ఎస్సైగా కృష్ణారావు



వినుకొండ(నూజెండ్ల): ఐనవోలు ఎస్సైగా బి.వి కృష్ణారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. వినుకొండ టౌన్ పోలీస్టేషనులో విధులు నిర్వహిస్తున్న కృష్ణారావు బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. గతంలో ఎస్సైగా ఉన్న లక్ష్మీ నారాయణరెడ్డి డీజీపీ ఆఫీస్ హెడ్‌క్వార్టర్స్‌కు ఎటాచ్ అయ్యారు.

రూరల్ ఎస్సైగా అనిల్‌కుమార్



చిలకలూరిపేట టౌన్: చిలకలూరిపేట రూరల్ ఎస్ఐగా జి. అనిల్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పల్నాడు జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న ఆయన బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు.

నరసరావుపేట రూరల్ ఎస్సైగా కిశోర్



నరసరావుపేట రూరల్: నరసరావుపేట రూరల్ ఎస్సైగా సీహెచ్ కిశోర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎస్సైగా పనిచేసిన రోశయ్య సీసీఎస్‌కు బదిలీ అయ్యారు.

శావల్యాపురం ఎంపీడీవోగా మీనా సీతారామయ్య

శావల్యాపురం: శావల్యాపురం ఎంపీడీవోగా మీనా సీతారామయ్య నియమితులయ్యారు. గతంలో పనిచేసిన ఎంపీడీవో కవితాచౌదరి ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. శుక్రవారం రిలీవ్ అయిన ఆమెకు కార్యాలయం సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు అవసరం

శావల్యాపురం: ఖరీఫ్ సీజనుకు రైతులు సాగుకు సన్నద్ధం అవుతున్న నేపథ్యంలో విత్తనాల విషయంలో జాగ్రత్తలు అవసరమని ఏడీఏ బోయపాటి రవిబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు విత్తనాలు కొనుగోలు సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. లేదంటే నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. పంట పూర్తిగా చేతికి వచ్చేవరకు విత్తనాల ఖాళీ సంచులు, డీలర్ ఇచ్చే రసీదులు తదితరాలు భద్రంగా ఉంచాలని కోరారు.

సరైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

వినుకొండ(నూజెండ్ల): సకాలంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికార సుగుణాబేగం అన్నారు. నూజెండ్ల మండలంలోని కంభంపాడు గ్రామంలో రైతు సేవా కేంద్రంలో పొలం బడి కార్యక్రమంలో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జేజీఎల్ 384 వరి రకానికి ప్రత్యామ్నాయంగా పలు విత్తనాలు సాగు చేసుకోవచ్చని తెలిపారు. కేజీకి రూ.5 చొప్పున రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. ఏఈవో ఎల్.ఎలీషా, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలో ప్రత్యేకాధికారి తనిఖీ



నాదెండ్ల: గణపవరం రాజీవ్‌గాంధీ కాలనీలోని పాఠశాలను నాదెండ్ల మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఫిషరీష్ ఆఫీసర్ ఎస్. సంజీవరావు తనిఖీ చేశారు. ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్, ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మారుతిబాబులతో కలిసి ప్రాథమిక పాఠశాలను శుక్రవారం పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను తెలుసుకున్నారు. విద్యార్థులు ఆడుకునేందుకు గ్రౌండ్ లెవలింగ్ చేయించాలని హెచ్ఎం ఏవీ సత్యనారాయణ కోరారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నరసరావుపేట ఈస్ట్: శ్రావణ మాసం తొలి శుక్రవారాన్ని పురస్కరించుకొని మహిళలు పెద్ద ఎత్తున ఆలయాల్లో పూజలు నిర్వహించారు. పాతూరు శివాలయం, శ్రీచౌడేశ్వరి, శ్రీకళ్యాణ సుందరేశ్వరస్వామి, శ్రీశృంగేరీ శంకరమఠంలోని శ్రీశారదాంబ, శ్రీపాండురంగ స్వామి తదితర ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. పాండురంగస్వామి ఆలయంలో ధర్మకర్త తాటికొండ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కొత్త హనుమంతరావు, మాధవ సాంబశివరావు సహకారంతో 108 మంది మహిళలు కుంకుమ పూజలో పాల్గొన్నారు. సత్తెనపల్లిరోడ్డు రామాలయం సమీపంలోని వడియరాజుల బజారులో నూతనంగా నిర్మించిన శ్రీషణ్ముఖేశ్వరి ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

టీడీపీ నాయకుల తీరుపై నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత నాయకులు

వినుకొండ(నూజెండ్ల): విజయవాడ నడిబొడ్డున మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నిర్మించిన అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పంపై టీడీపీ నాయకులు చేసిన దాడిని దళిత నేతలు తీవ్రంగా ఖండించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా ఆదేశాల మేరకు వినుకొండలో అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల నాయకులు పొలేష్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గతంలో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేరును తొలగించడం రాజకీయ దాడిగా అభివర్ణించారు. టీడీపీ గూండాలు దళితుల మనోభావాలు దెబ్బతీస్తూ ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం హేయం: చంద్రశేఖర్



నరసరావుపేట: విజయవాడ అంబేడ్కర్ విగ్రహం వద్ద శిలాఫలకం ధ్వంసం చేయడం హేయమైన చర్యని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూచిపూడి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. గురువారం రాత్రి విజయవాడ నడిబొడ్డున ఉన్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం దగ్గర కొంతమంది వ్యక్తులు సెక్యూరిటీ సిబ్బందిని తోసేసి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును తొలగించడం హేయమైన చర్యగా భావిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటం నుంచి దృష్టి మళ్లించేందుకు చేపట్టిన చీకటి చర్యగా దీన్ని భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ చర్య అంబేడ్కర్‌పై దాడిగా భావిస్తున్నామని తెలిపారు.

గిరిజన తండాల్లో వసతుల పరిశీలన



తండాలో డ్రైనేజీని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

బొల్లాపల్లి: గిరిజన తండాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని స్థానిక అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం మండలంలోని సీతారామ్‌పురం తండా, వెల్లటూరులోని గిరిజన బాలుర వసతి గృహాన్ని అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. స్థానికుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. డీసీడబ్ల్యూ వరలక్ష్మి, సీఎల్‌పీఓ చుక్కా రమణయ్య, మండల ప్రత్యేక అధికారి రవిబాబు, తహసీల్దారు సుధాకర్, ఎంపీడీవో విజయకుమార్, ఎంఈఓ సయ్యద్ జఫ్రుల్లా, పలు శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాదుస్తులు పంపిణీ



దుస్తులు అందిస్తున్న డాక్టర్ ఇన్నారెడ్డి

నాదెండ్ల: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాలలో క్రీడాకారులకు దాతలు అందించిన క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఆర్ఆర్ ఇన్‌ఫ్రా అధినేత యన్నం రవీంద్రారెడ్డి, దుద్దెంపూడి వేమారెడ్డి దీనికి ఆర్థికసాయం చేశారు. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం ఝాన్సీవాణి, వైస్ హెచ్ఎం ప్రసన్నకుమార్, పీఈటీ హనుమంతరావు, యన్నం శివారెడ్డి, జె.అప్పిరెడ్డి తదితరులు ఉన్నారు.

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో గల గుడ్‌షపర్డ్ స్కూల్ ఆవరణలో క్రీడాకారులకు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఇన్నారెడ్డి చేతుల మీదుగా క్రీడాదుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాఫ్ట్‌బాల్ స్టేట్ టోర్నమెంట్ శనివారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు చెప్పారు. తగిన సదుపాయాలు కల్పించనున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 26 పురుషులు, మహిళా జట్లు పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు నరసింహారెడ్డి, చిరంజీవి, సురేష్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై మానవత్వం చూపాలి



మాట్లాడుతున్న అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ

నరసరావుపేట టౌన్: దివ్యాంగులపై ప్రతి ఒక్కరూ మానవత్వం చూపాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్. సత్యశ్రీ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటిగ్రేటెడ్ విద్యాలయంలో దివ్యాంగుల హక్కులపై నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. చట్టపరంగా వారికి ఉన్న ప్రత్యేక హక్కులను వివరించారు. ధ్రువీకరణ పత్రాలు పొందే విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సంక్షేమ పథకాలు పొందటంలో చట్టపరంగా అవసరమైతే ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో..

వితంతు పెన్షన్‌లపై ఎంపీడీవో కార్యాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి టి. ప్రవల్లిక ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉచిత న్యాయ సహాయం పొందే విధానం గురించి వివరించారు. చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎండీవో రవికాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఈపూరు: మండలంలోని అన్ని విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలో గల గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. ఈ మేరకు విద్యుత్ శాఖ ఏడీఈ బి. వెంకటేశ్వరరెడ్డి, ఏఈ ఎస్.గాంధీబాబులు తెలిపారు. ఆయా గ్రామాల్లో మరమ్మతుల నిమిత్తం సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు గమనించాలని సూచించారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలో అన్ని గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని మండల విద్యుత్ శాఖ ఏఈ కె. రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిడుగురాళ్లలో 220/132/33 కె.వి.విద్యుత్ సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. మండలంలో అన్ని గ్రామాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు. 3 ఫేజ్ విద్యుత్ సరఫరా శనివారం తెల్లవారుజామున 12 – ఉదయం 9 గంటల వరకు ఇస్తామని పేర్కొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: విద్యుత్ సబ్ స్టేషన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలతోపాటు మండలంలోని పలు గ్రామాలలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ మేరకు విద్యుత్ డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని కేబీరోడ్డు, గాంధీపేట, ఎన్ఆర్‌టీ సెంటర్, పండరీపురం, సంజీవనగర్, చెరువు రోడ్డు, మండలంలోని బొప్పూడి, పసుమర్రు, మురికిపూడి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. నాదెండ్ల మండల పరిధిలోని సాతులూరు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట: పట్టణంలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఏఈఈ వై.ఏడుకొండలు శుక్రవారం ఈ మేరకు తెలిపారు. పల్నాడురోడ్డు, పాతచెక్ పోస్టు సెంటర్, రామిరెడ్డిపేట, ప్రకాష్‌నగర్ సతీష్‌రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ వెనుకవైపు, విద్యానగర్, సెయింట్ జోసెఫ్ స్కూలు, జెండాచెట్టు, 60 అడుగుల రోడ్డు ప్రాంతాల్లో సరఫరా ఉండదని చెప్పారు.

వైద్య సేవల పరిశీలన

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో 104 వాహనం ద్వారా అందిస్తున్న సేవలను జిల్లా ఫ్యామిలీ డాక్టరు నోడల్ అధికారి డి.హనుమకుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం అమలు చేస్తున్న వైద్య సేవలు పారదర్శకంగా అందించాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర బాధితుల ఇళ్లకు నేరుగా ఆరోగ్య అధికారులు, సిబ్బంది వెళ్లి పరిశీలించాలన్నారు. తగిన వైద్య సూచనలు అందించాలని తెలిపారు. అనంతరం గ్రామంలోని ఎంపీపీ పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం వంటకాల రుచి, మెనూ అమలు తీరును పరిశీలించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రావిపూడి రమ్య, ఆరోగ్య కార్యకర్తలు అమరలింగేశ్వరి, మాధురి పాల్గొన్నారు.

నిధుల రికవరీకి నిర్ణయం

నాదెండ్ల: మండలంలో గతేడాది జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు గుర్తించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు రూ.6.65 లక్షల మేరకు అవకతవకలు జరిగినట్లు డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ గుర్తించారు. గతేడాది 634 పనులకు రూ.8.82 కోట్లు మంజూరయ్యాయి ఇందులో అవకతవకలకు గురైన రూ.2.90 లక్షలను ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రికవరీ చేయనున్నారు. మరో రూ.3.74 లక్షలకు సంబంధించిన పనులపై డ్వామా ఏపీడీ సుధాకర్ ఆధ్వర్యంలో విచారణ జరగనుంది.

మంచి అలవాట్లతో ఆరోగ్య పరిరక్షణ



చిలకలూరిపేట: నడక, వ్యాయామం వంటి మంచి అలవాట్లతో ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఐ. స్వాతి పేర్కొన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని జాలయ్యకాలనీలో ఉచిత వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. రోగాలబారిన పడ్డాక ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకునే బదులు ముందుగానే మేల్కొంటే ఉపయోగకరమని తెలిపారు. ఇది మంచి అలవాట్లతోనే సాధ్యమవుతుందన్నారు. శిబిరంలో పాల్గొన్న డాక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ.. మంచి ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ సుమన్, న్యాయవాదులు జీవీహెచ్ఎస్ ప్రసాద్, మాదాసు భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరు తల్లి ఆర్చి ప్రారంభం



రొంపిచర్ల: మండలంలోని బుచ్చిబాపన్నపాలెం గ్రామంలో మాజీ శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మించిన పోలేరు తల్లి గుడి ఆర్చిని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ..ఆర్చిని నిర్మించిన దాతలను అభినందించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోపిరెడ్డికి గ్రామస్తులు సాదరంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్చి దాతలు పల్లపు కొండలరావు, కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, వద్దుల సుబ్బారెడ్డి, పునుగోటి వెంకట్రావు, గాజుల మాణిక్యం, మోతుకూరి వెంకటేష్ తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

13న మండల స్థాయి వ్యాసరచన పోటీలు

రొంపిచర్ల: స్థానిక బీసీ కాలనీలోని భగత్‌సింగ్ భవన్‌లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 13న మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు భగత్ సింగ్ భవన్ నిర్వహణ కమిటీ ముఖ్య కార్యదర్శి ఎస్.రామకృష్ణంరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు 'దుర్వ్యసనాలు–దేశ ప్రగతిపై వాటి ప్రభావాలు' అంశంపై ఈ పోటీ జరుగుతుందన్నారు. తొలి ముగ్గురు విజేతలకు రూ.2 వేలు, రూ.వెయ్యి, రూ.500 వంతున ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు 89851 08146 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కర్లకుంటలో పారిశుద్ధ్య పనులు



రొంపిచర్ల: మండలంలోని కర్లకుంట గ్రామంలో శుక్రవారం పారిశుద్ధ్య పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలోని సైడు కాలువల్లో పూడికను తొలగించారు. వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలుగు యువత నాయకుడు వడ్లమూడి వెంకట కిషోర్ అన్నారు. పూడికతీత పనులను ఆయనతోపాటు గ్రామపెద్దలు, అధికారులు పర్యవేక్షించారు.

వెద పద్ధతిలో వరి నాటితే ప్రయోజనాలు



నరసరావుపేట రూరల్: వెద పద్ధతిలో వరి నాటడం వల్ల రైతుకు పెట్టుబడి వ్యయం తగ్గి అధిక దిగుబడి లభిస్తుందని లాం ఫాం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్.సాంబశివరావు, పి.అమరజ్యోతి, జిల్లా సీనియర్ శాస్త్రవేత్త వెంకటరాములు తెలిపారు. మండలంలోని పాలపాడులో ఖరీఫ్‌లో వరి సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వల్పకాలిక రకాలైన ఎంటీయూ 1224, కేఎస్ఎం 1638 వరి విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో కేజీకి రూ.5 వంతున సబ్సిడీతో అందజేస్తున్నట్టు తెలిపారు. స్వల్పకాలిక రకాలు, వాటి దిగుబడి తీరుపై రైతులకు అవగాహన కల్పించారు. వరిలో కలుపు నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ మస్తానమ్మ, ఏవో నరేంద్రబాబు, రైతులు పాల్గొన్నారు.

పీజీ వైద్యసీట్లలో కేటాయింపు తగ్గించడం తగదు



ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు వినతిపత్రం అందిస్తున్న వైద్యులు

శావల్యాపురం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యాధికారులకు పీజీ ప్రవేశాల్లో 30 శాతం ఉన్న కేటాయింపులను సగానికి తగ్గించడం సరికాదని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనతో తమకు భవిష్యత్తులో కూడా అనేక సమస్యలు తప్పవని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ వైద్యశాలల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులు రాధాకృష్ణన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును కలిశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని వినతిపత్రం అందించారు. వైద్యాధికారి రావిపూడి రమ్య, సూపర్‌వైజరు ఉమాదేవి, అలవలపూడి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరిపై నిరసన



పోస్టల్ కార్యాలయం ఎదుట నేతల నిరసన



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

నరసరావుపేట: వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేలా కేంద్రం తీరు ఉందని, కేంద్రం మద్దతు తెలిపే కార్పొరేట్లను తరిమికొట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు పిలుపునిచ్చారు. శుక్రవారం రైతు సంఘాలు, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 'క్విట్ కార్పొరేట్' అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వ సంస్థ పోస్టల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు డి. శివకుమారి , ఎల్ఐసీ ఏజెంట్స్ యూనియన్ నాయకులు నబీబాజీ, షేక్ సిలార్, కోండ్రు ఆంజనేయులు, వైదన వెంకట్, షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

వినుకొండ(నూజెండ్ల): అఖిల భారత కిసాన్ మహాసభ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శివయ్య స్తూపం సెంటర్ వద్ద కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్ర అధ్యక్షులు తోట ఆంజనేయులు మాట్లాడుతూ.. దేశ సంపదను లూటీ చేస్తున్న కార్పొరేట్ సంస్థలను బహిష్కరించాలని పేర్కొన్నారు. కె. వెంకటేశ్వర్లు, పల్లపాటి భాస్కర్, దుర్గాప్రసాద్, ప్రసాద్, లింగాచారి, గోపి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో పోటీతత్వం అలవాటు



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈవో లక్ష్మి

చిలకలూరిపేట: క్రీడలతో ఆరోగ్యంతోపాటు పోటీతత్వం కూడా అలవడుతుందని మండల విద్యాశాఖ అధికారి కె.లక్ష్మి చెప్పారు. ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం, స్వాతంత్ర్య దిన వేడుకలను పురస్కరించుకొని నియోజకవర్గ స్థాయి క్రీడా, సాంస్కృతిక నాలుగు రోజుల పోటీలు శుక్రవారం మొదలయ్యాయి. పట్టణంలోని సాదినేని చౌదరయ్య పబ్లిక్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో దీనికి వేదికైంది. పోటీలను ప్రారంభించిన ఎంఈవో మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని చెప్పారు. తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలని కోరారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని తెలిపారు. గెలుపోటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తి చాటాలన్నారు. క్రీడ, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులను అభినందించారు. పలు పాఠశాలకు సంబంధించి 40 జట్లు పాల్గొన్నాయి. తొలిరోజు వాలీబాల్, త్రోబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాసర్జి, ఇన్‌చార్జి బి. భగత్‌సింగ్, వ్యాయామ ఉపాధ్యాయులు షేక్ ఖాదర్‌మస్తాన్, రాజు, నాగరాజు, మనోహర్, షలోమి, అస్మిత్ పాల్గొన్నారు.

ఇద్దరు దారి దోపిడీదొంగలు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ పి.రామకృష్ణ

నరసరావుపేట రూరల్: దారి దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్టు రూరల్ సీఐ పి.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం స్టేషనులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గుంటూరుకు చెందిన షేక్ బాబావలి ఈనెల 5వ తేదీన ఆటోలో నరసరావుపేట వస్తుండగా ఆటోను ఆపి రూ.3 వేల నగదు, సెల్‌ఫోన్లు దుండగులు అపహరించారని పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారని తెలిపారు. యల్లమంద పంచాయతీ పరిధిలోని కేఎస్పీ కాలనీకి చెందిన దేవర భవాని ప్రసాద్, పట్టణంలోని మార్కెట్ సెంటర్‌కు చెందిన జాజం సంతోష్‌కుమార్‌లు దారిదోపిడీకి పాల్పడినట్టు గుర్తించామన్నారు. శుక్రవారం పాలపాడు వెళ్లే దారిలో మేజర్ కాలువ వద్ద నిందితులను అరెస్ట్ చేసినట్టు వివరించారు. ఈ కేసులో మరో నిందితుడు సాయిని అరెస్ట్ చేయాల్సి ఉందని తెలిపారు. నిందితులపై గతంలో పలు దారిదోపిడీ కేసులు ఉన్నట్టు చెప్పారు. సమావేశంలో రూరల్ ఎస్ఐలు రోశయ్య, బాలకృష్ణలు కూడా పాల్గొన్నారు.

దూర విద్యా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

యడ్లపాడు: మండలంలోని జగ్గాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దూర విద్యా కేంద్రాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విద్యా పీఠం రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎస్.అక్బర్‌అలీ అన్నారు. మండలంలోని జగ్గాపురం జడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా పీఠం అధికారి హుస్సేన్, ఎంఈఓలు నాగరత్నం, అరుణ కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాదెండ్ల: బడి మానేసిన విద్యార్థులను ఏపీ ఓపెన్ స్కూలు వరమని స్టేట్ కోఆర్డినేటర్ అక్బర్ అలీ చెప్పారు. పల్నాడు జిల్లా నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విద్యా వనరుల కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గోడపత్రికను ఆవిష్కరించారు. ఓపెన్‌స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ హుస్సేన్, ఎంఈవో కృష్ణారెడ్డి, హెచ్ఎం నిర్మల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలకు సమాచారమిచ్చే బాధ్యత అధికారులదే

బొల్లాపల్లి: ప్రతి శాఖకు చెందిన ప్రభుత్వ అధికారి సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలని ఏడీఏ, మండల ప్రత్యేకాధికారి బోయపాటి రవిబాబు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం గురించి వివిధ శాఖలకు సంబంధించి ప్రభుత్వ అధికారులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో వీపీ విజయకుమార్, ఏవో ఎ. అంకారావు, పశుసంవర్ధక శాఖ అధికారి అమీర్‌బాషా, శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాదెండ్ల: అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావటం కోసమే సమాచార హక్కు చట్టం ప్రవేశపెట్టారని మండల వ్యవసాయాధికారి ఎ. హరిప్రసాద్ చెప్పారు. నాదెండ్ల రైతు సేవా కేంద్రంలో చట్టంపై శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు కార్యక్రమంలో ఉద్యాన, వ్యవసాయ శాఖల సహాయకులు ఉన్నారు.

బ్యాంకు పథకాన్ని వినియోగించుకోండి

నరసరావుపేట: యూనియన్ బ్యాంకు అమలు చేసే సమృద్ధి డిపాజిట్ పథకాన్ని ఉపయోగించుకొని అత్యధిక వడ్డీ పొందాలని బ్యాంకు ప్రాంతీయ అధికారి మాధురి కోరారు. శుక్రవారం నరసరావుపేట రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో అవగాహన పెంపునకు పట్టణంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ కార్యాలయం నుంచి సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్ఏ స్టేడియం వరకు కొనసాగింది. బ్యాంకు ఉప ప్రాంతీయ అధికారులు మురళీమోహన్, సోమేశ్వరరావు, మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.